ఇఫ్తార్‌లతో మతసామరస్యం



పీఅండ్‌టీ కాలనీలో ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో దావత్ ఏ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.
మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్‌లోని గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ సెక్రటరీ సానెం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి

మణికొండ: సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అవి మన వరకు రాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో కమ్యూనిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... సీసీ కెమెరాలతో నేరాలను నివారించటంతో పాటు నేరాలు జరిగినా వాటికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఇంటికీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడితే చట్ట పరమైన చర్యలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. మత్తు పదార్థాలు వాడే వారి వివరాలను పోలీసులకు అందజేసి వాటిని నిర్మూలించేందుకు సహకరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, సెక్టార్ ఎస్ఐ మురళీధర్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోండి



రోడ్ల పక్కన నరికివేసిన చెట్లు

మణికొండ: సంవత్సరాల తరపడి నీరు పోసి రోడ్ల పక్కన పెంచిన చెట్లను అడ్డగోలుగా నరికి వేసిన బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ ఖిజ్రా కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఖిజ్రా కాలనీలో గతంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్ల పక్కన మొక్కలు నాటిని వాటిని పెద్దగా చేశారు. అలాంటి వాటిని ఓ బిల్డర్ తన నిర్మాణానికి అడ్డు వస్తున్నాయనే కారణంతో పూర్తిగా తొలగించారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ అలీ తెలిపారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశామన్నారు. సదరు బిల్డర్‌పై పర్యావరణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుని అదే స్థాయి మొక్కలను తిరిగి నాటించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వరల్డ్ కిడ్నీ డే

గోల్కొండ: వరల్డ్ కిడ్నీ డే వేడుకలు గురువారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఘనంగా జరిగాయి. ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి మహ్మద్ హబీబ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు కేక్‌కట్ చేసి డయాలసిస్ విభాగ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మానవ శరీరంలో కిడ్నీ అత్యంత ప్రముఖమైనదన్నారు. కిడ్నీ దెబ్బతినడం వల్ల శరీరాన్ని ఇతర రోగాలు కూడా తొందరగా సోకుతాయన్నారు.

హోలీకి సర్వం సిద్ధం

సందడిగా కాముడి దహనాలు | రంగులను సిద్ధం చేసుకున్న ప్రజానీకం | చిన్నారుల్లో మరింత జోష్ తేనున్న హోలీ



మణికొండలో కామదహనం చేస్తున్న ప్రజలు

మణికొండ: ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా హిందువుల పండగలు వస్తుంటాయి. వాటిని కలిసికట్టుగా ఆనందోత్సవాల నడుమ జరుపుకొని ఎంతో మంది ఆనందిస్తారు. అందులో భాగంగా చలికాలం పోయి వేసవి ప్రారంభంలో వచ్చే రంగుల పండగ హోలీని ఆనందోత్సాహాల నడుమ శుక్రవారం నిర్వహించుకునేందుకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు సిద్ధం అయ్యారు.

- వేసవిలో ఎండలను భరించాలంటే అంతకు ముందు కొన్ని చెట్ల రసాలు, రంగులను శరీరానికి పూసుకుని, రంగులుగా చేసుకుని చల్లుకుంచే ఆరోగ్యానికి బాగుంటుందనే ఉద్దేశంతో పూర్వ కాలం నుంచి రంగుల పండగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిపిందే.
- మనుషుల్లో ఉండే కాముడిని దహనం చేసి అనంతరం ప్రజలంతా హోలీ పండగను నిర్వహించుకుంటారు. గ్రామాలలోని కూడళ్లలో పిడకలు, కట్టెలను కుప్పలుగా వేసి వాటికి పూజలు నిర్వహించి కాముడిగా భావించి వాటిని దహనం చేస్తారు. దాంతో తమలోని కాముడు దహనమైనట్టు భావిస్తారు.
- మణికొండ, నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీలతో పాటు రాజేంద్రనగర్ సర్కిల్‌లో వ్యాపారులు రంగులను జోరుగా అమ్మకాలు చేస్తున్నారు.
- పిల్లలు మరింత హుషారుగా రంగుల పండగను జరుపుకొంటారనే ఉద్దేశంతో వారికి అవసరమైన సామగ్రిని ఇప్పిస్తున్నారు.
- అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలలో సామూహికంగా పండగను చేసుకునేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసుకున్నారు.

బండ్లగూడలో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హోలీ సందర్భంగా ఘనంగా కామ దహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో పలు కాలనీలలో గురువారం రాత్రి కామ దహన కార్యక్రమాలు జరిగాయి.

మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి: హోలీ పండగను పురస్కరించుకొని ప్రజలు గురువారం రాత్రి కామ దహన కార్యక్రమాలను నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి, దుర్గానగర్, కాటేదాన్, లక్ష్మీగూడ, వాంబే కాలనీ, పద్మశాలీపురం, టీఎన్‌జీవోస్ కాలనీ, మార్కండేయనగర్ తదితర ప్రాంతాల్లో కామ దహన కార్యక్రమాలను చేపట్టారు.



మణికొండ క్వార్టర్స్‌లో కామదహనంలో పాల్గొన్న యువత



మణికొండలో రంగులు విక్రయించే దుకాణాలు



బండ్లగూడలో...



మైలార్‌దేవ్‌పల్లిలో...

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మైలార్‌దేవ్‌పల్లి: ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే వాటిని ఉపేక్షించమని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ హెచ్చరించారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని 156/1లో వెలిసిన ఆరు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీసుల బందోబస్తు నడుమ అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్లను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఆరు రేకుల షెడ్‌లను ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే దీనిపై స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేశామన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు తమవంతు బాధ్యతగా వ్యవహరిస్తున్నామన్నారు. కొందరు రాత్రికిరాత్రి అక్రమంగా షెడ్‌లు వేసుకొని నిర్మాణాలను చేస్తున్నారన్నారు. వీటిని ఉపేక్షించమని... ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

హైదర్‌గూడలో...

అత్తాపూర్: అనుమతులు లేకుండా నిర్మించిన అదనపు అంతస్తులను గురువారం కూల్చివేశారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని యాంబియన్స్ ఫోర్ట్‌లోని అనుమతులు లేకుండా నిర్మించి అదనపు అంతస్తులను, పెంట్‌హౌస్‌ను రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ ఆదేశానుసారం టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... నిర్మాణాలు చేపట్టే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎవరి ఇష్టానుసారంగా వారు నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించి కూల్చివేస్తామన్నారు. ఎంత కెపాసిటీ ఉంటే అంత వరకే నిర్మాణాలు చేసుకోవాలన్నారు.

బుల్కాపూర్ నాలాపై సమగ్ర సర్వే చేస్తాం

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

మణికొండ: బుల్కాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు ఉన్న బుల్కాపూర్ నాలాపై సమగ్ర సర్వే చేయించి దానిపై, బఫర్, ఎఫ్‌టీఎల్‌లలో వచ్చిన ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ వెల్లడించారు. గురువారం సాయంత్రం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ నాలాను ఆయన పరిశీలించారు. నాలాను ఆక్రమించి దాని బఫర్ జోన్‌లో టీం ఫోర్ అనే నిర్మాణ సంస్థ రెడీమిక్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి రాత్రీపగలనే తేడా లేకుండా వాహనాలను తిప్పుతూ కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన గురువారం టీం ఫోర్ నిర్మాణ సంస్థ ఆర్ఎంసీ ప్లాంట్‌ను పరిశీలించారు. బఫర్‌లో ఎలా ఏర్పాటు చేస్తారని ప్రాజెక్ట్ మేనేజర్‌ను ప్రశ్నించారు. భూమిపై సరైన హక్కులు లేకుండానే నిర్మాణాలు చేస్తున్నారని, ఓ వైపు నిర్మాణం కొనసాగుతుండగానే మున్సిపాలిటీ వారు కాలనీల్లో రోడ్లను తవ్వి డ్రైనేజీ కనెక్షన్ ఇచ్చారని ఫిర్యాదు చేశారు. గతంలో బుల్కాపూర్ నాలాలో నీరు వెళ్లి స్థానికంగా భూగర్భ జలాలు పెరిగేవని, ప్రస్తుతం దాన్ని అన్యాక్రాంతం చేయటంతో నీరంతా కాలనీల్లోకి వస్తున్నదని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ట్రయల్స్ విల్లాల ముందు పంచవటి కాలనీని కలుపుతూ వస్తున్న రోడ్డును త్వరగా తెరిపించాలని, దాంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తప్పుతాయని పంచవటి కాలనీ వాసులు కోరారు. దాంతో ఆయన రెండు రోజుల్లో రోడ్డుకు అడ్డుగా ఉన్న షీట్‌లను తొలగించాలని అధికారులను ఆదేశించారు.



బుల్కాపూర్ నాలాపై ఆక్రమణలను తెలుసుకుంటున్న రంగనాథ్

అన్నదానం

గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత, కోట మైసమ్మ ఆలయంలో గురువారం అల్లి శివచంద్రగిరి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, ఉపాధ్యక్షులు వై.రామకృష్ణ, మామిడి కృష్ణ, జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గిరి, సుమన్ కుమార్, కార్యదర్శి రాజు, శ్రీకాంత్, నాగరాజ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రూ.101 కోట్లతో రోడ్డు విస్తరణ



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రోడ్డు విస్తరణ పనులను చేపడుతున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. వంద ఫీట్ల రోడ్డుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు అందాయన్నారు. ఈ మేరకు గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి వయా కిస్మత్‌పూర్ బండ్లగూడ జాగీర్ హెచ్‌పీ పెట్రోల్ పంప్ జంక్షన్ వరకు 5.5 కిలో మీటర్ల వరకు రూ. 66 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. వివేకానంద విగ్రహం నుంచి వయా మున్సిపల్ ఆఫీస్, ఎక్సైజ్ అకాడమీ వరకు 2.05 కిలో మీటర్లు రూ. 24 కోట్లతో, దర్గాఖలీజ్‌ఖాన్ వై జంక్షన్ నుంచి ఎల్వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వరకు 0.85 మీటర్ల వరకు రూ. 11 కోట్లతో రోడ్డు విస్తరించనున్నట్లు తెలిపాఉ. మొత్తం రూ. 101 కోట్లతో హెచ్ఆర్‌డీసీఎల్ సంస్థ ఈ పనులను చేపట్టనుందన్నారు. రోడ్డు జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా పరిశీలించామని వివరించారు. కార్యక్రమంలో సీఈ శ్రీనివాస్, ఈఈ మహబూబ్ మియా, కిషోర్ బాబు, అరవింద్, తులసీకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటి పాటల్లో సాహిత్యం పదిలం

గన్‌ఫౌండ్రీ: నాటి సినీ పాటల్లో సంగీతం, సాహిత్యం పదిలంగా ఉన్నాయని సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో వంశీ ఆర్ట్ థియేటర్స్, శారద ఆకునూరి (అమెరికా)ల సంయుక్త ఆధ్వర్యంలో స్వరకర్తలకు స్వర నీరాజనం పేరిట 56వ దశకంలో సినీ దర్శకుడు స్వరపరిచిన పాటలను ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమెరికాలో స్థిరపడి విదేశీ సంస్కృతికి ఆకర్షింపబడకుండా పాత పాటల్లోని మాధుర్యాన్ని అందించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు నిర్వహించిన సంగీత విభావరి ఆహూతుల హృదయాలను రంజింపజేసింది. కార్యక్రమంలో కళాపోషకుడు బొల్లినేని కృష్ణయ్య, వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, మేనేజింగ్ ట్రస్టీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు భేష్

- ట్రాఫిక్ డీసీపీని కోరిన బీఆర్ఎస్ నాయకులు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: పేద విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని మానవ సేవే మాధవ సేవా సంస్థ చైర్మన్ ఏర్వ కుమారస్వామి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ సెంటర్–2లో డాక్టర్స్ క్లినిక్, న్యూట్రిషన్ బునియాడ్ ప్రోగ్రామ్ కింద మేడ్ట్రానిక్–యునైటెడ్ వే హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో అంగన్‌వాడీ విద్యార్థులకు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రొటీన్ పౌడర్, విటమిన్లు, మినరల్స్, పారాసిటమాల్, ఆయింట్‌మెంట్, ఓఆర్ఎస్ వంటి అవసరమైన పోషక పదార్థాలను అందజేశారు. సంస్థ డైరెక్టర్లు గోంత్యాల శ్రీనివాస్, హేమలత, అంగన్‌వాడీ టీచర్లు అనిత, లక్ష్మీ, మాధవి, రత్నకుమారి, హెల్పర్లు సంగీత, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఏఐపై శిక్షణ



ఉపాధ్యాయులకు ఏఐపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

శంషాబాద్ రూరల్: ఉపాధ్యాయులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల విద్యాధికారి వి.కిషన్‌నాయక్ అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పైలట్ ప్రాజెక్టుగా వెబ్ టూల్‌లో విద్యార్థులకు స్వీయంగా అభ్యసించే అవకాశాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎంఈఓ అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, యాదయ్య, రిసోర్స్ పర్సన్స్ వి.ఎల్. ఆనంద్‌కుమార్, పి.మహేష్ మనోహర్, ఎంజేపీ ప్రిన్సిపాల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించండి



డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: పదవ తరగతి పరీక్షలు హాజరయ్యే విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయిమనోహర్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. గురువారం ఆయనను బీఆర్ఎస్ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ... మణికొండ మున్సిపల్ కేంద్రంలోని పలు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు పెద్ద సమస్యగా ట్రాఫిక్ నిలుస్తుందన్నారు. అందుకు మణికొండ మర్రిచెట్టు, అలకాపూర్ బటల్‌షిప్ సర్కిల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సర్కిల్, లాలమ్మ గార్డన్, పంచవటి కాలనీ కూడలిలలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాలలో అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తమ పరిధిలో ఉన్నంత మేర విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తామని డీసీపీ హామీ ఇచ్చారని బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు కె.ధన్‌రాజ్, జి.నరేందర్, ఎం.లక్ష్మయ్య, కిరణ్, భానుచందర్, సుమనళిని, బి.శ్రీధర్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలి

- సినీనటుడు సుమన్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుమన్

మణికొండ: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, అందులో భాగంగా అప్పుడప్పుడు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని సినీనటుడు సుమన్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ చైతన్య కాలనీలోని డాక్టర్ ప్రభు లైఫ్ మల్టీస్పెషాలిటీ క్లినిక్స్ ఆధ్వర్యంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం, మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం సుమన్ మాట్లాడుతూ... ప్రస్తుతం తీసుకుంటున్న కల్తీ ఆహారం, వాయు కాలుష్యంతో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమగ్ర ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకుని వైద్యుల సలహాలను పాటించి ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలతో పేదలకు ఉత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాలిని ఆయన అభినందించారు. డాక్టర్ మాట్లాడుతూ... మొత్తం 324 మందికి మధుమేహం, కిడ్నీ, లివర్, ఎముకలు, హిమోగ్లోబిన్ లాంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామన్నారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దాం



ఎమ్మెల్యేతో సమావేశమైన ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

మణికొండ: సమస్యల పరిష్కారానికి మనమంతా కలిసికట్టుగా కృషి చేద్దామని, త్వరలోనే ఓ సమావేశం ఏర్పాటు చేసి వాటిపై చర్చిద్దామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఫెడరేషన్ నూతన కమిటీ నాయకులు ఆయనను గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలతో పాటు సమస్యలు పెరుగుతున్నాయన్నారు. వాటి పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి కాలనీతో పాటు మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న సమస్యలపై త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో చర్చిద్దామన్నారు. అన్ని శాఖల అధికారులు, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు సమావేశంలో ఉంటే వాటికి పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు, కోశాధికారి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు పాల్గొన్నారు.

మురుగు పరుగును ఆపండి



హైదర్‌గూడ పిల్లర్ నెంబర్ 145 వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

అత్తాపూర్: రోడ్లపై మురుగు పరుగు రోజు రోజుకూ అధికం అవుతోంది. ఏరులై పారే మురుగు నీరు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నది. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 145 వద్ద జోయ్ ఆస్పత్రి ప్రాంతంలో మురుగు నీరు పొంగిపొర్లుతోంది. ఎన్నిసార్లు ఎయిర్‌టెక్ మిషన్‌తో శుభ్రం చేయించినా మళ్లీ ఒకటి రోజు రెండు రోజుల్లోనే పరిస్థితి మొదటికే వస్తోంది. అధికారులు నామమాత్రంగా వచ్చి క్లీన్ చేసి వెళ్తున్నారు. దీని వల్ల పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.